

ఏడో రోజుకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన



మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు టీచర్లు

ప్రజాశక్తి- పాడేరు :తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పన, సమాన పనికి సమాన వేతనం, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాడేరు ఐటిడిఎ ఎదుట చేపట్టిన నిరసనదీక్షలు శుక్రవారం ఏడోరోజుకుచేరుకున్నాయి. ఈ సందర్భంగా మోకాళ్లపై నిరసన చేపట్టారు. ఇవ్వాలని డిమాండ్. చేశారు.

గ్యాంగ్‌రేప్ నిందితులను

కఠినంగా శిక్షించాలి

- ఎస్ఎఫ్ఐ, ఆదివాసీ గిరిజన మహిళా సంఘాల ర్యాలీ
- పాడేరు ఐటిడిఎ వద్ద నిరసన



పాడేరులో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ, మహిళా సంఘాల నేతలు

ప్రజాశక్తి-పాడేరు: విశాఖలో న్యాయవిద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన దోషుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ డిమాండ్ చేస్తూ అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం ఎస్ఎఫ్ఐ, ఆదివాసీ గిరిజన మహిళా సంఘం ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థినులు భారీ ర్యాలీ ఐటిడిఎ వద్ద నిరసన చేపట్టారు. విశాఖలో లా విద్యార్థినిపై లైంగిక దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు ..

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ అల్లూరి జిల్లా కార్యదర్శి జీవనకృష్ణ, గిరిజన మహిళా సంఘం ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్ హైమావతి మాట్లాడుతూ, విశాఖలో న్యాయవిద్యార్థినిని ప్రేమ పేరుతో వంచించి సామూహికంగా ముగ్గురు యువకులు బెదిరించి, అత్యాచారానికి పాల్పడడం అమానుషమని, నిందితుల కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మహిళలకు పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించాలంటూ డిమాండ్ చేశారు. ఏజెన్సీలోని గిరిజన బాలికల హాస్టళ్లలో వాచ్‌మెన్‌లను నియమించాలని, గిరిజన విద్యార్థులకు పూర్తిస్థాయిలో రక్షణ, భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు ఆందోళనలో అల్లూరి జిల్లా కమిటీ ఆదివాసీగిరిజన మహిళా సంఘాలకు చెందిన 500 మంది మహిళలు, విద్యార్థులు ర్యాలీ, ధర్నాలో పాల్గొన్నారు. మహిళలు, విద్యార్థులకు రక్షణ కల్పించాలంటూ నినాదాలు చేశారు. విశాఖలో అత్యాచార బాధిత న్యాయవిద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అల్లూరి జిల్లా ఎస్ఎఫ్ఐ నాయకులు చిన్నారావు, ఆదివాసీ గిరిజన మహిళా సంఘ సభ్యురాలు లత, పెద్దసంఖ్యలో మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వాలంటీర్ల కలెక్టరేట్ ముట్టడి

- జయప్రదం చేయాలని సిఐటియు పిలుపు


మాట్లాడుతున్న గ్రామ వాలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు దేవా

ప్రజాశక్తి ముంచింగిపుట్టు : గ్రామ, వార్డు వాలంటీర్ల కొనసాగింపు, వారి సమస్యలపై ఈనెల 23న శనివారం పాడేరులో జిల్లా కలెక్టరేట్ ముట్టడి, మహాధర్నా అందోళనను జయప్రదం చేయాలని గ్రామ వాలంటీర్ల సంఘంమండల అధ్యక్షుడు గొల్లోరి దేవా శుక్రవారం పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండలంలోని 23 పంచాయతీల గ్రామ వాలంటీర్లు మహా ర్యాలీలో పాల్గొవాలని కోరారు.

ఈసందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో రాష్ట్రంలోని కూటమి నేతలు తాము అధికారంలోకి రాగానే గ్రామ వాలంటీర్లను కొనసాగించడంతోపాటు నెలసరి రూ.పదివేలు వేతనం చెల్లిస్తామని, బకాయి వేతనాలను క్లియర్ చేస్తామని హామీనిచ్చారన్నారు. అయితే అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి డోలా వీరాంజనేయులు గ్రామ వాలంటీర్లకు సంబంధించి జిఒ లేదని వెల్లడించడం దుర్మార్గమన్నారు. ఇచ్చిన హామీ మేరకు వాలంటీర్లను కొనసాగించడంతోపాటు వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర సమస్యల పరిష్కార హామీలను నెరవేర్చాలని కోరారు. లేనిపక్షంలో మండల, జిల్లా కార్యయాలను, సచివాలయాలను ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో వి గిద్దోని, గుప్త ప్రసాద్, సుబ్బారావు, కిరణ్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ పాంగి బేసు

ప్రజాశక్తి- హుకుంపేట:మండలంలోని తీగలవలస పంచాయతీ డి.గరుడాపల్లి గ్రామానికి పంచాయతీ నిధులతో మట్టి రోడ్డు నిర్మాణానికి స్థానిక ప్రజలతో కలిసి సర్పంచ్ పాంగి బేసు శుక్రవారం శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాంగి.బేసు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో భాగంగా అందుబాటులో ఉన్న పంచాయతీ నిధులు రూ.1.50లక్షలతో ఒక.కిలోమీటరు దూరం మట్టి రోడ్డు గుంతలు పూడ్చి నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామస్తులు, పంచాయతీ పాలకమండలి నిర్ణయం మేరకు రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

గతంలో నిధులు లేక పంచాయతీ పరిధిలో సిసి రోడ్లు, డ్రైనేజీలు, కుళాయి మరమ్మతులు, వీధిదీపాలు వంటివి చేయలేకపోయామని, ఇటీవల మంజూరైన నిధులతో ప్రజోపయోగ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో పంచాయతీ బూత్ ఇన్‌చార్జి కె. కామరాజు, పాంగి. అర్జున్, వంతాల.భీమరాజు, మర్రి లింగేశ్వరరావు గ్రామస్థులు పాల్గొన్నారు.

మూడు సెంట్లు స్థలంతో ఇళ్లు ఇవ్వండి

ప్రజాశక్తి - చింతపల్లి : నిరుపేద గిరిజన కుటుంబాలకు మూడు సెంట్లు ఇంటి స్థలం కేటాయించడంతో పాటు నూతన గృహాలు మంజూరు చేయాలని సిపిఐ ఎర్ర బొమ్మల ఎంపిటిసి సెగ్గే సత్తిబాబు అన్నారు. శుక్రవారం ఆ పార్టీ మండల కార్యదర్శి పేట్ల పోతురాజు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, స్థానిక గిరిజనులతో కలసి స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ గిడ్డి రాజ్‌కమార్, ఎంఆర్ఒ మొట్టడం కష్ణమూర్తిలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2006 నుండి ఇప్పటివరకు వివిధ పథకాల ద్వారా మంజూరు చేసిన ఇళ్లు పలుకారణాలతో వివిధ దశలలో నిర్మాణాలు నిలిచిపోయి ఉన్నాయని, వాటికి సంబంధించిన బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. పార్టీ సీనియర్ నాయకులు గెమ్మెలి కుజ్జన్న, పి చిన్నారావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్ రెహమాన్, కె.మల్లేశ్వరరావు, ఎస్ రాజబాబు పాల్గొన్నారు.

అదానీ ఒప్పందాలు రద్దు చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర


మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి అరకులోయ రూరల్: పాడేరు ఏజెన్సీ అనంతగిరి, చింతపల్లి మండలాల్లో ఎర్రవరం, పెదకోట, చిట్టంపాడు, గుజ్జెలి ప్రాంతాల్లో గత వైసిపి ప్రభుత్వం అదానీతో 5500 మెగావాట్ల విద్యుదుత్పత్తి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందాలను తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం అరకులోయలోని ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో విలేకరులతో మాట్లాడుతూ గత రాష్ట్ర క్యాబినెట్ 2022 డిసెంబర్ 13న నాటి రాష్ట్ర కేబినెట్ ఎనిమిది ప్రాజెక్టుల నిర్మాణానికి 94 గ్రామాల పరిధిలోని 15 వేల మంది ఆదివాసీ నిర్వాసితులకు చెందిన 20 వేల ఎకరాల భూములు, అడవులను సేకరించాలని నిర్ణయించిందన్నారు. అదే జరిగితే అడవులు, అటవీ సంపద ముంపుబారిన పడి గిరిజనుల జీవనం సర్వనాశనమౌతుందని ఆవేదన వ్యక్తం చేశారు ఏజెన్సీలోని పీసా, 1/70 చట్టాలు, గ్రామసభలు తీర్మానం, ఆమోదం లేకుండా గిరిజన హక్కులు, చట్టాలు ఉల్లంఘించి, రూ. 1750 కోట్లకు పైగా ముడుపులను అధికారులకు ఎరవేసి అప్పట్లో అదానీతో గత వైసిపి ప్రభుత్వం చీకటి ఒప్పందం చేసుకుందన్నారు.ఈ అక్రమ వ్యవహారం వెలుగులోకి రావడం, దీనిపై అమెరికా లో కేసు నమోదైన నేపథ్యంలో అదానీని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు ఆదివాసీ చట్టాలు హక్కులు, జీవన విధానానికి నష్టం కలిగించే అదానీ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందాలను తెలుగుదేశం కూటమి ప్రభుత్వం రద్దు చేయాలన్నారు సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్, మండల అధ్యక్షులు జి.బుజ్జిబాబు, పి.రామన్న పాల్గొన్నారు.

అక్రమ ఒప్పందాల్లో బాధ్యులను అరెస్ట్ చేయాలి : సిపిఎం

పాడేరు : అల్లూరి ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి అదానీతో నాటి జగన్ ప్రభుత్వం చేసుకున్న అడ్డగోలు ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స డిమాండ్ చేశారు. అదానీతోపాటు ఈ అక్రమంలో భాగస్వాములైన నేతలు, అధికారులను అరెస్ట్ చేయాలని కోరారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అల్లూరి జిల్లా ఎర్రవరం, పెద్దకోట, గుజ్జెలి, చిత్తంపాడు, రైవాడ, పార్వతీపురం మన్యం జిల్లాలో ఏజెన్సీప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టులో భాగంగా ప్రతి ప్రాజెక్ట్‌లోనూ లోయర్, అప్పర్ డ్యామ్‌ల నిర్మాణాలకు 5వేల ఎకరాల అటవీ భూమిని కేటాయించారన్నారు. ఈ వ్యవహారంలో అనుమతులు, భూకేటాయింపుల్లో అక్రమాలు, అవినీతి జరిగిందని, అక్రమ పద్ధతిని ప్రాజెక్టులకు అనుమతులిచ్చారని అంతర్జాతీయ న్యాయస్థానంలో అదానీపై కేసు నమోదైన నేపథ్యంలో అడ్డగోలు ఒప్పందాలన్నీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో అదానీ డేటా సెంటర్‌కు కేటాయింపులను కూడా రద్దు చేసి, రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. దేశ వ్యాప్తంగా సుమారు రూ.2029 కోట్లు, అందులో ఎపిలో రూ.1750కోట్లు ముడుపులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో లంచం ఇచ్చి అక్రమ ఒప్పందం కుదుర్చుకున్నట్లు స్పష్టమైన నేపథ్యంలో బాధ్యులైన రాజకీయ నేతలు, అధికారులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎల్. సుందరరావు, పాలికి లక్కు, చిట్టిబాబు పాల్గొన్నారు.

రెండు నెలలకే నూరేళ్లు నిండాయి...

మన్యంలో ఆగని శిశు మరణాలు!

- గడుగుపల్లిలో వింతవ్యాధితో చిన్నారి మృతి


మృతి చెందిన చిన్నారి

ప్రజాశక్తి -హుకుంపేట: మన్యంలో శిశు మరణాలు మరణాలు అగడం లేదు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గడుగుపల్లి గ్రామంలో రెండున్నర నెలల పాప శుక్రవారం ఉదయం హఠాన్మరణం పొందింది. అంతు చిక్కని వ్యాధులతో చిన్నపిల్లలు పిట్టల్లా రాలిపోతూ, కన్న తల్లిదండ్రుల్లో గుండెకోత మిగులుస్తున్నా వాటి నివారణకు చర్యలు లేవనే విమర్శలున్నాయి. మండలంలోని తాడిపుట్టు పంచాయితీ. గడుగుపల్లి గ్రామంలో మహేష్ నాయుడు, శాంతి కుమారి దంపతుల మూడో సంతనం, రెండున్నర నెలలు పాపకు ఒక్క రోజే జ్వరం వచ్చింది. శుక్రవారం 9 గంటల సమయంలో ఊపిరాడక అస్వస్థతకు గురై, చూస్తుండగానే మరణించిందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. అప్పటివరకు ఆడుతూ, నవ్వుతూ బాగానే ఉన్న చిన్నారి అంతలోనే మృత్యువాత పడడంతో కన్నతల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. చిన్నారి పడుకుందని భావించిన తల్లిదండ్రులు, ఆమెను లేపే ప్రయత్నం చేయగా, కన్నుమూసినట్లు గుర్తించి తల్లడిల్లిపోయారు. గడచిన మూడేళ్లలో గ్రామంలో ఇలాగే పదిమంది దాకా చిన్నారులు ప్రాణాలను కోల్పోయారని గ్రామస్తులు అంటున్నారు. గడుగుపల్లిలో మూడు నెలల నుంచి మూడేళ్లలోపు ఆరుగురు చిన్నారులు మృతి చెందారని వాపోతున్నారు. అంతుచిక్కని కారణాలతో చిన్నారుల మరణాలపై జిల్లా వైద్యఆరోగ్యశాఖతోపాటు ఐటిడిఎ అధికారులు దృష్టిపెట్టి తగు చర్యలు చేపట్టాలని, తల్లిదండ్రుల గుండెకోతకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

అంగన్వాడీల బిల్లులకు పర్సంటేజ్ వసూలు చేస్తున్న

సూపర్ వైజర్ సత్యవతిపై చర్యలు తీసుకోవాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు ఐసిడిఎస్ పరిధిలో ఫీడింగ్‌కు సంబంధించి వెజిటేబుల్, ఫైర్ హుడ్ బిల్లులు చెల్లించడానికి అంగన్వాడీ వర్కర్ల నుండి 10శాతం పర్సంటేజ్ వసూలు చేస్తున్న ఐసిడిఎస్ సూపర్వైజర్ సత్యవతిపై ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఆమెను విధుల నుండి తొలగించాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన శుక్రవారం జరిగిన సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు అతి తక్కువ వేతనాలతో కేంద్రాల నిర్వహణ చేస్తున్నారని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ఒకపక్క వారు ఆందోళన చేస్తుంటే, వారు చేసిన ఖర్చులు ఇవ్వడానికి పర్సంటేజ్‌లు వసూలు చేయడం దారుణమన్నారు. అంగన్వాడీ వర్కర్ నుండి ప్రమోషన్‌తో గ్రేడ్ టు సూపర్వైజర్‌గా వచ్చిన సత్యవతి నేడు వర్కర్లను వేధించడం శోచనీయమన్నారు. సత్యవతి చూసే సెక్టార్‌లోనే కాకుండా మిగతా సెక్టార్‌లో కూడా బెదిరించి మరి 10 శాతం పర్సంటేజ్‌లు వసూలు చేస్తున్నారని, పర్సంటేజ్ డబ్బులు ఇవ్వకపోతే బిల్లులు రావని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. పర్సంటేజ్ డబ్బులు ఇవ్వకపోవడం వల్ల ఇప్పటికే రూ.8 లక్షల బిల్లులు వెనక్కి పోయాయని, ఇక నుండైనా పర్సంటేజ్ ఇవ్వకపోతే బిల్లులు రావని చెప్పడం దుర్మార్గమన్నారు. పెరిగిన ధరలతో పోల్చితే వచ్చే బిల్లులు చాలా తక్కువగా ఉన్నాయని, వాటిల్లో కూడా పర్సంటేజీలు వసూలు చేయడం దారుణమన్నారు. ప్రశాంతంగా నడిచే చింతూరు ఐసిడిఎస్ ప్రాజెక్టుని సూపర్ వైజర్ సత్యవతి అవినీతిమయంగా మార్చుతున్నారని, ప్రాజెక్టులో రెండో సిడిపిఒగా వ్యహరిస్తూ అవినీతికి తెరలేపుతున్నారని విమర్శించారు. దీనిపై తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సూపర్వైజర్ సత్యవతిని విధుల నుండి తొలగించాలని, వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు నాయకులు కారం సుబ్బారావు, పొడియం జానీ, కారం మనోజ్ పాల్గొన్నారు.

26న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

కేంద్ర ప్రభుత్వాలు రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు దేశవ్యాప్త నిరసనలో భాగంగా ఈనెల 26న రంపచోడవరం సబ్ కలెక్టరేట్ కార్యాలయం వద్ద జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర నాయకులు జి.బేబీరాణి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు, ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. స్థానిక తాపీ మేస్త్రీల సమావేశ భవనంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి రామరాజు అధ్యక్షతన శుక్రవారం జరిగిన ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో నిరసనపై సమీక్ష, గ్రామీణ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలపై చర్చించారు. నిరసనలో రైతులు, కార్మికులు, కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బేబీరాణి కోరారు. పార్లమెంట్ సాక్షిగా దేశ ప్రధాని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని, మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌స్‌ను రద్దు చేసి, 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అంగన్వాడీ, ఆశా వర్కర్స్ యూనియన్లు, గిరిజన సంఘం సిఐటియు, డివైఎఫ్ఐ, ఇతర ప్రజా సంఘాల నాయకులు టి శ్రీను, కె జగన్నాథం, ఎం రమేష్, కె వెంకటలక్ష్మి, సిహెచ్ కుమారి, సత్యవతి, వీరలక్ష్మి, సూర్యకుమారి, లక్ష్మిశ్రీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు బేబీరాణి


సన్యాసిరావు మృతదేహాన్ని వెలికి తీస్తున్న దృశ్యం

కొడుకును హతమార్చిన తండ్రి

మద్యానికి బానిసైన కుమారుడు నుంచి ప్రాణహాని ఉందనే భయంతో హత్య

ప్రజాశక్తి-సీలేరు

మద్యానికి బానిసై తరచూ గొడవపడుతున్న కుమారుడు నుండి కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని భావించిన తండ్రి కుమారుడిని హత్య చేసిన సంఘటన జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధి ఏనుగుబయలు గ్రామంలో చోటుచేసుకుంది. ఈ నెల 14న జరిగిన ఈ ఘనటకు సంబంధించి జికె.వీధి సిఐ వరప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం... ఏనుగుబయలు గ్రామానికి చెందిన సన్యాసిరావు (40) మద్యానికి బనిసై తరచూ మద్యం సేవించి తన తండ్రి చిత్రో, ఇతర కుటుంబ సభ్యులతో గొడవలు పడుతూ వారిని కొట్టేవాడు. ఈ నెల 14 గురువారం రాత్రి కూడా సన్యాసిరావు పూటుగా మద్యం సేవించి తండ్రితో గొడవపడ్డాడు. అడ్డుకున్న తల్లిని, ఇద్దరు తమ్ముళ్లను తీవ్రంగా కొట్టాడు. సన్యాసిరావు నుండి కుటుంబ సభ్యులు తప్పించుకోగా, సన్యాసిరావు కత్తి పట్టుకొని వెతుకులాట ప్రారంభించాడు. కుమారుడు సన్యాసిరావు వలన ప్రాణహాని ఉందని భావించిన తండ్రి గొడ్డలి తీసుకొని గ్రామ సమీపంలో ఉన్న కొండ దగ్గర ఉన్న చెట్టు చాటున దాక్కున్నాడు. ఆ సమయంలో అటుగా కత్తి పట్టుకుని సన్యాసిరావు వస్తుండగా, తనను హతమారుస్తాడని భయంతో తండ్రి చిత్రో వెనుక నుండి కుమారుడు సన్యాసిరావుని గొడ్డలితో బలంగా కొట్టాడు. దీంతో సన్యాసిరావు అక్కడికక్కడే మృతి చెందాడు.

గొడవ జరిగిన తరువాత తన భర్త సన్యాసిరావు ఆచూకీ తెలియకపోవడంతో సన్యాసిరావు భార్య సీలేరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఏనుగుబయలు గ్రామంలో శుక్రవారం లోతుగా విచారణ చేయగా సన్యాసిరావుని తండ్రి చిత్రో హతమార్చి గ్రామ సమీపంలో పూడ్చి వేసినట్లు గుర్తించారు. అనంతరం చింతపల్లి డిఎస్పి సహబాద్ అహమ్మద్ ఆధ్వర్యంలో పూడ్చిపెట్టిన సన్యాసిరావు మృతదేహాన్ని వెలికితీసి గ్రామ పెద్దల్లో సమక్షంలో పంచనామ చేసి పోస్టుమార్టం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. నిందితుడు చిత్రో పరారీలో ఉన్నాడు. నిందితునిపై కేసు నమోదు చేసి ఆయన ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని సీఐ వరప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీలేరు ఎస్ఐ కే.రవీంద్ర, జికె.వీధి ఎస్ఐ అప్పలసూరి, దారకొండ సర్పంచ్ నడిగట్ల రాజు, ఎంపీటీసీ మాడి రామన్న, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకర విష్ణుమూర్తి, స్థానికులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-మోతుగూడెం

మాదక ద్రవ్యాల వల్ల వచ్చే అనర్థాలపై జిల్లాలోని వై.రామవరం మండలం డొంకరాయి బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డొంకరాయి ఎస్సై శివకుమార్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి, డ్రగ్స్ లేకుండా చేయాలనే ఎస్పి ఆదేశాల మేరకు సంకల్పం అనే ప్రోగ్రామ్ రూపొందించినట్లు తెలిపారు. గంజాయి పండించడం, రవాణా చేయడం నేరమని, అలా చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే 9381123100 నెంబర్‌కు తెలియచేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, వారికి తగిన పారితోషకం అందజేస్తామని తెలిపారు. అనంతరం విద్యా హక్కు చట్టం, జువనైల్ జస్టిస్ చట్టంపై అవగాహన కల్పించారు.


సుధబాబు ఆశయ బాటలో పయనిద్దాం

ప్రజాశక్తి-ఎటపాక

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కమిటీ నాయకుడు, సిపిఎం నేత కామ్రేడ్ బి.సుధబాబు ఆశయాల బాటలో పయనించాలని సిపిఎం మండల కార్యదర్శి ఐవి పిలుపునిచ్చారు. కామ్రేడ్ సుధబాబు ఐదో వర్ధంతి కార్యక్రమం మండలంలోని మురుమూరులో ఆయన స్థూపం వద్ద పార్టీ నాయకులు కాకా అర్జున్ అధ్యక్షతన జరిగింది. ముందుగా సుధబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐవి జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. సుధబాబు తుది శ్వాస వరకు పేద ప్రజల కోసం జరిగిన అనేక పోరాటాల్లో పాల్గొన్నారని తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ ఎటపాక మండలం నిర్వాసితుల కమిటీ నాయకుడుగా, నిర్వాసితుల సమస్యలపై సుధ బాబు పనిచేశారని చెప్పారు. సుధబాబు చూపిన బాటలో నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ సిపిఎం పోరాడుతుందని ఐవి తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సోయం వీరమ్మ, శాఖ సభ్యులు సోయం పెదబాబు, అమరవరపు నాగేంద్ర, సోయం లక్ష్మణరావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

104 సిబ్బంది సమస్యలపై జెడ్‌పిటిసికి వినతి

ప్రజాశక్తి-విఆర్.పురం : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని రేఖపల్లి పీహెచ్‌సీ 104 సిబ్బంది స్థానిక జడ్పిటిసి సభ్యులు వాళ్ళ.రంగారెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగులు మాట్లాడుతూ తమకు నెల నెల సక్రమంగా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాలను పోషించటం చాలా కష్టతరంగా మారిందని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా కేవలం రూ.50 వేలు ఖర్చుతో నిర్వహించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలని కోరారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డి.ఈ.ఓకు జిఓ నెంబర్ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పియఫ్ తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చెల్లించాలని, ఉద్యోగులకు యాజమాన్యం నుండి రావలసిన ఇతర బకాయిలు చెల్లించాలని పై సమస్యలు పరిష్కారానికి రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన జెడ్‌పిటిసి మాట్లాడుతూ ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో 104 ఉద్యోగులు సంఘం ట్రెజరర్ బి.వర ప్రసాద్, డిఈఓ, డ్రైవర్ జి.యేసు రాజు పాల్గొన్నారు.


జెడ్‌పిటిసి రంగారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు



ఇళ్ల నిర్మాణాలను ప్రారంభిస్తున్న హౌసింగ్ పీడీ బాబు

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

ప్రజాశక్తి -హుకుంపేట: ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ బాబు కోరారు. శుక్రవారం మండలంలోని కొట్నాపల్లి పంచాయతీ సువ్వపాడు గ్రామంలో ఎంపిటిసి సాంబయ్య బాలకృష్ణ ఆధ్వర్యంలో వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావుతో కలిసి ఇళ్ల నిర్మాణాల గ్రౌండింగ్ మేళా నిర్వహించారు. ముందుగా మంజూరైన లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా హౌసింగ్ శాఖ పిడి బాబు మాట్లాడుతూ పీఎం జన్‌మన్ కింద గ్రామంలో 12 మందికి ఇళ్ళు మంజూరయ్యాయని, లబ్ధిదారులు త్వరగా ఇల్లు నిర్మాణం చేపట్టాలని కోరారు. నిర్మాణాల ప్రాప్తికి దశలవారీగా బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హుకుంపేట హౌసింగ్ ఎఇఇ ఈశ్వరి, భాను, గ్రామస్తులు పాల్గొన్నారు.



మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

రాష్ట్రస్థాయిలో మెరిసి...జాతీయ స్థాయికి!

ప్రజాశక్తి -పాడేరు: పాడేరులో,ఈ నెల 20,21 తేదీలలో జరిగిన ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ క్రీడాపోటీలలో పలువురు గిరిజన విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో విజయం సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల కంటబంసుగుడ, అరకు వ్యాలీ, విద్యార్థినులు ఐశ్వర్య జాతీయ స్థాయికి ఎంపికైంది. అండర్ 14, బాలికల విభాగంలో దేవిప్ర రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి, ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించింది. అండర్ 14 బాలికల విభాగంలో,ఐశ్వర్య, మంచి ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయికి ఎంపికైంది. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినులతోపాటు పిఇటిపాంగి సూరిబాబును పాఠశాల ప్రధానోపాధ్యాయులు తంగుల. మోహనరావుతోపాటు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

డిగ్రీ కాలేజీకి బెంచీల వితరణ

ప్రజాశక్తి - చింతపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కాలేజ్ వసతి గృహ అధికారులు వసుపులేటి వినాయక రావు, గసాడి. తిరుపతిరావు, అతిథి అధ్యాపకులు కలిసి విద్యార్థులు కూర్చునేందుకు వీలుగా ఏడు సిమెంటు బెంచీలను వితరణగా అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం విజయభారతి మాట్లాడుతూ విద్యార్థులకు, కళాశాలకు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు, అతిథులకు అసౌకర్యం కలగకుండా ఇలా బెంచీలను వితరణ చేయడం శుభ పరిణామం అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని జరిగి మన కళాశాల అల్లూరి జిల్లాలో మంచి పేరు సంపాదించు కోవాలని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ . కెజియా, కె.సంతోష్, జగదీష్ బాబు, గ్రంథాలయ అధికారి జగతరావ్, వి. ఈశ్వరరావు, ఎం నాగేంద్రబాబు, పూర్ణ, శ్రీనివాస్ రవీంద్రబాబు, సాగిన నాగరాజు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

పిజిఆర్ఎస్‌లో అధికారులకు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-పాడేరు: ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఐటిడిఎలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక, మీకోసంలోపాల్గొని వివిధ మండలాల నుండి వచ్చిన వారి నుండి జాయింట్ కలెక్టర్ డాక్టర్. ఎంజె. అభిషేక్ గౌడ, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్‌తో కలిసి 98 అర్జీలను స్వీకరించారు. రహదారుల నిర్మాణాలు, తాగునీటి సదుపాయాలు, ఉపాధి అవకాశాలు కోసం, భూముల పట్టాలు, రేషన్ డిపోలు ఏర్పాటు కోసం వినతులు అందాయి. పాడేరు మండలం గుడివాడ కాలనీకి చెందిన బి.పి. సింహాచలం తన సాగు భూమికి పట్టా మంజూరు చేయాలని కోరారు. కొయ్యూరు మండలం తీగల మెట్ట గ్రామానికి చెందిన అమర్ రంజిత్ ఉపాధి అవకాశం కల్పించాలని వినతి పత్రం సమర్పించారు. అనంతగిరి మండలం బొర్రా పంచాయతీ పూలుగూడ గ్రామస్థుడు ఓ. పరమేశ్వరరావు, ఎస్. కోటేశ్వరరావు తదితరులు సీసీ రోడ్డు మంజూరు చేయాలని కోరారు. హుకుంపేట మండలం పాత కోట పంచాయతీ పి. చింతలుచ ఎంపిపి పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలని పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు వినతిపత్రం సమర్పించారు. హుకుంపేట మండలం బూర్జ ఎంపిటిసి మజ్జి హరి జాకర వలస నుండి ఎగ సల్గాని మీదగా పాంటరిపాడు వరకు రోడ్డు నిర్మించాలని కోరారు. కొయ్యూరు మండలం బూదరాళ్ల సర్పంచ్ ఎస్. ముత్యాలమ్మ పిట్టలపాడు, వంత మర్రి గ్రామాల మధ్య కల్వర్టు నిర్మించాలని కోరారు. కొయ్యూరు మండలం గుమ్మ రేవుల పంచాయతీ కాకనూరు, కొల్లూరుకోట, బోదులురు గొంది, నేలజర్తి గ్రామాలకు ప్రత్యేకంగా రేషన్ డిపో ఏర్పాటు చేయాలని కోడా బొంజుబాబు, తదితరులు వినతి పత్రం అందజేశారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

వికలాంగులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

జిల్లాలో ఇద్దరు విభిన్న ప్రతిభావంతులకు మంజూరైన ల్యాప్‌టాప్‌లను కలెక్టర్ అందజేశారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్ల స్వయం సహాయక సంఘాన్ని ప్రారంభించారు. స్వయం ఉపాధి రంగాలలో ట్రాన్స్ జెండర్లకు తగిన శిక్షణ అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. యాచన మానేసి ఉద్యోగాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్ఓ. పద్మలత, డిఎంహెచ్ఓ డాక్టర్ జమాల్ బాషా, ఆర్‌అండ్‌బి ఇఇ బాల సుందరబాబు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇలు కె. వేణుగోపాల్, జి. డేవిడ్‌రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ జవహర్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ ఇంచార్జ్ డిడి. ఎల్. రజని, ఐటిడిఎ పరిపాలనాధికారి ఎం. హేమలత, డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్. కుమార్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడి మాధవి, పాడేరు తాహశీల్దార్ వి. త్రినాధరావు నాయుడు పాల్గొన్నారు.

నేడు లంబసింగి ఎఫ్‌పిఒ కలెక్షన్ సెంటర్ ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఎఫ్‌పిఒ సెంటర్

ప్రజాశక్తి - చింతపల్లి : లంబసింగి ట్రైబల్ ప్రొడక్ట్స్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ పేరిట రాజుపాకల సమీపంలో ఏర్పాటు చేసిన లంబసింగి ఎఫ్‌పిఒ కలెక్షన్స్ సెంటర్, కోల్డ్ స్టోరేజీ, అవుట్‌లెట్స్‌ను ఈనెల 23న శనివారం ప్రారంభించనున్నారు. 2021లో స్థాపించిన ఈ కంపెనీ నాబార్డ్ సహకారంతో గిరిజనులను ప్రోత్సహించడంతో భాగంగా మన్యంలో సహజసిద్ధంగా లభించే గిరిజన సేంద్రీయ ఉత్పత్తుల ద్వారా వివిధ రకాల చిరుధాన్యాలు, పండ్ల రసాలు, వివిధ రకాల పచ్చళ్ళు తయారు చేయడం, వాటి నాణ్యత, శీతల గిడ్డంగి ద్వారా ఉత్పత్తుల రక్షణకు ఏర్పాటుచేసిన కోల్డ్ స్టోరేజీ, అవుట్ లెట్స్, ఎఫ్‌పిఒ కలెక్షన్ సెంటర్లను శనివారం ఐఐఎంఆర్ ఐసిఎఆర్ డైరెక్టర్ డాక్టర్ సి.తార సత్యవతి, ఎపిఎఫ్‌పిఎస్‌సి ఇఒ డాక్టర్ గెడ్డం శేఖర్ బాబు, అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, పాడేరు ఐటిడిఎ పిఒ వి అభిషేక్ శనివారం ప్రారంభించనున్నారని తెలిపారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి -అనంతగిరి : మండల కేంద్రమైన అనంతగిరిలో ఫ్రైడే డ్రైడేలో భాగంగా స్థానిక సర్పంచ్ సోమ్మెల.రూతు ఆధ్వర్యంలో పారిశుధ్య పనుల చేపట్టారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. వారంలో ఒక్కరోజు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం ద్వారా దోమలు, వాటి లార్వాల వృద్ధిని నివారించి, సంబంధిత వ్యాధులు దరిచేరకుండా చూడొచ్చన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఇంజనీరింగ్ అసిస్టెంట్ సంధ్య భారతి. వెటర్నరీ అసిస్టెంట్ రవి, ఎంఎస్‌డబ్ల్యు సూర్యారావు పాల్గొన్నారు



పారిశుధ్య పనుల్లో పాల్గొన్న సర్పంచ్, సిబ్బంది

నేరాలు ఘోరాలు

వంద కిలోల గంజాయి సీజ్

ప్రజాశక్తి -అనంతగిరి : ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం పోలీస్ స్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీ చేస్తుండగా, ఏజెన్సీ ప్రాంతం నుండి మైదాన ప్రాంతానికి అక్రమంగా గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. అరకు నుండి ఎస్ కొట వైపు వెళ్లే వాహనాలు తనిఖీ చేస్తుండగా, తమిళనాడుకు చెందిన రెండు స్విఫ్ట్ కారులో సుమారు 100 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, వాటిని తీసుకెళుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకునిఅ రెస్ట్ చేశామన్నారు. తమిళనాడుకు చెందిన ముగ్గురు, అరుకువేలీకి చెందిన మరో ఇద్దరితోపాటు ఐదుగురు వ్యక్తులు పరారయ్యారని తెలిపారు వారి కోసం గాలింపు చేపడతామన్నారు. కేసు దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

శారదా నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లిని ఆనుకుని ప్రవహిస్తున్న శారదానదిలో గుర్తు తెలియని వృద్ధుని మృత దేహం శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దేవరాపలి-పినకోట రోడ్డుకి ఆనుకుని శారదా నదిలోని నీటిలో మృతదేహం తేలియాడుతుండగా, స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం తెలియజేశారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించారు. వృద్ధుడు ఏ గ్రామానికి చెందిన వాడో ఎవరూ గుర్తించలేక పోయారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు తమకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట జాతీయ రహదారి 16, నూకాలమ్మ తల్లి ఆలయం సమీపంలోని రాజీవ్‌గాంధీ పాలటెక్నిక్ కళాశాల దగ్గర గురువారం రాత్రి కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందారు. సదరు వ్యక్తి గురువారం రాత్రి రోడ్డు దాటుతున్న సమయంలో కారు ఢీకొన్నట్లు కశింకోట సిఐ అల్లు స్వామి నాయడు తెలిపారు. మృతుడు ఎవరనేది తెలియరాలేదని, ఆచూకీ తెలిసిన వారు కశింకోట పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని సిఐ అల్లు స్వామి నాయడు కోరారు.

వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో చోరీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ముషిడిపల్లిలో వాసవి కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ఆలయం గేట్ల గడులను తొలగించిన ఆలయంలోకి చొరబడి రెండు హుండీలను పట్టుకుని దగ్గరిలో ఉన్న మామిడితోటలోకి వెళ్లారు. అక్కడ హుండీలను తెరిచి అందులోని నగదుతో పాటు భక్తులు అమ్మవారికి సమర్పించి కానుకల్ని తీసుకుని ఖాళీ హుండీలను అక్కడే విడిచిపెట్టి వెళ్లి పోయారు. అమ్మవారి ఆలయంలో చోరీ జరిగిన విషయాన్ని దేవరాపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వాసవి క్లబ్ అధ్యక్షుడు కొప్పాక అప్పారావు విలేకరులకు తెలిపారు. కాగా దొంగతనం జరిగినప్పుడు సీసీ కెమేరాల్లో కొంత రికార్డు అయ్యిందని ఆయన స్పష్టం చేశారు.

దోపిడీ కేసులో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంవిపి క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి బీచ్ రోడ్డులోని లుంబినీ పార్క్ సమీపంలో జరిగిన దోపిడీ సంఘటనకు సంబంధించి నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు ద్వారకా సబ్ డివిజన్ ఎసిపి ఎ.వెంకటరావు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఎంవిపి క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఆ కేసు వివరాలు వెల్లడించారు. అరిలోవ టిఐసి పాయింట్‌కు చెందిన కె.శ్రీనివాసరావు బుధవారం రాత్రి 8.30 గంటల సమయంలో తన మిత్రులతో కలిసి లుంబినీ పార్కు సమీపంలో కూర్చుని మాట్లాడుతుండగా అప్పుఘర్ ప్రాంతానికి చెందిన వాసుపల్లి నవీన్, కొమర సోమరాజు, గరికిన ఎల్లాజీ, వెంకోజిపాలెంకు చెందిన ఎద్దు రాజు అక్కడికి చేరుకుని ఘర్షణపడ్డారు. ఈ క్రమంలో శ్రీనివాసరావును గాయపరిచి రూ.320 నగదును, వాచ్, సెల్‌ఫోన్‌ను ఎత్తుకుపోయారు. బాధితుడు డయల్ 112కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయగా వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. గాలింపు చర్యలు చేపట్టి నిందితులను పట్టుకున్నారు. చోరీ చేసిన నగదు, వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో నవీన్‌పై గతంలో నాలుగు క్రైమ్ కేసులు, సోమరాజుపై రెండు కేసులు, ఎల్లాజీపై నాలుగు కేసులు ఉన్నాయి. మీడియా సమావేశంలో విశాఖ క్రైమ్ ఎడిసిపి మోహన్‌రావు, ద్వారకా సబ్ డివిజన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ బంగారు పాప, ఎస్‌ఐ రాజు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న గురుకుల అవుట్ సోర్సింగ్ టీచర్లు, అధ్యాపకులు

అవుట్ సోర్సింగ్ టీచర్లు, అధ్యాపకులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాలలు/కళాశాలల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ టీచర్లు, అధ్యాపకులకు రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. రంపచోడవరంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గిరిజన గురుకులాల ఔట్‌సోర్సింగ్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనాయక్ పిలుపు మేరకు, జిల్లా అధ్యక్షులు తాతాజీ ఆధ్వర్యాన ఇప్పటికే వారం రోజుల నుండి రంపచోడవరం డివిజన్ పరిధిలో టీచర్లు, అధ్యాపకులు విధులను బహిష్కరించి నిరసన దీక్షలు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. గత 15 సంవత్సరాలుగా గిరిజన గురుకులాల్లో రాత్రి, పగలు అనే తేడా లేకుండా పని చేస్తున్న తమకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచాలని, తమను డిఎస్‌సి నుండి మినహాయించి, తమను కూడా ఎంటిఎస్‌లోని మార్పు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ టీచర్లు, అధ్యాపకులు అనంత కుమారి, సత్యనారాయణ రెడ్డి, మోహన్, యుగంధర్, శివ శంకర్, సతీష్, లోవరాజు, హేమ సుధా, బేబీ రాణి, మల్లురమ, సత్యవతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జన్ జాతీయ గౌరవ్ సంబరాలకు విద్యార్థులు

ప్రజాశక్తి-రంచడవరం : గిరిజన స్వాతంత్ర్య సమరయోధులను గౌరవించే నిమిత్తం కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకటించిన జన్ జాతీయ గౌరవ్ దివాస్‌లో భాగంగా విశాఖపట్నంలో జరుగు వేడుకలకు రంపచోడవరం డివిజన్ నుండి పలువురు విద్యార్థులు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. విశాఖపట్నం ట్రైబల్ కల్చరల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ మిషన్ ఆధ్వర్యాన ఈ నెల 15 నుండి 26వ తేదీ వరకు జరుగుతున్న ఈ వేడుకుల్లో రాష్ట్రంలోని అన్ని ఐటిడిఎల నుండి ఇఎంఆర్‌ఎస్, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు, గిరిజన కళాకారులు నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. దీనికి రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసి స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను, వన్ దన్ వికాస కేంద్రం (వెలుగు)లో శిక్షణ పొందిన కళాకారులను విశాఖపట్నం పంపించారు. ఈ బస్సును రంపచోడవరం ఐటీడీఏ గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు విజయశాంతి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిల్లల సంరక్షణ కొరకు నియమించిన ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిఎం సూర్యఘర్, కుసుమ్ పథకాలతో ప్రయోజనాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాకారంతో అమలవుతున్న పిఎం సూర్యఘర్, పిఎం కుసుమ్ పథకాల ద్వారా వినియోగదారులకు ఎన్నో ప్రయోజనాలు లభిస్తాయని ఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృథ్వీతేజ్ ఇమ్మడి పేర్కొన్నారు. సోలార్ వినియోగం ద్వారా పొదుపు పెరుగుతుందని, ఆర్థిక ప్రయోజనాలు కూడా ఒనగూరుతాయని అన్నారు. పిఎం సూర్యఘర్ ద్వారా సాధారణ వినియోగదారులకు, కుసుమ్ పథకం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని, కావున వాటిని సద్వినియోగం చేసుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. ఆంధ్రా యూనివర్శిటీ మద్దిలపాలెం మైదానంలో ఎపి సోలార్ ఎనర్జి అసోసియేషన్ ఆధ్వర్యంలో రీ నెక్ష్ పేరుతో ఏర్పాటు చేసిన సోలార్ రెన్యూవబుల్ ఎనర్జి ఎక్స్‌పో - 2024ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎక్స్‌పో ఉద్దేశాలను, ఆవశ్యకతను తెలియజేశారు. ఈ క్రమంలో వివిధ కంపెనీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ కౌంటర్లను ప్రారంభించి సోలార్ విద్యుత్ సంబంధిత పరికరాలను పరిశీలించారు. వాటి వినియోగతీరు, ప్రయోజనాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. డిస్కమ్ పరిధిలో ప్రతి ఒక్క వినియోగదారుడికీ సోలార్ విద్యుత్ ఇవ్వాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు.

బలిమెల నీటి వినియోగంపై సమీక్ష

ప్రజాశక్తి-సీలేరు

ఆంధ్ర ఒరిస్సా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి నిల్వల వినియోగంపై ఇరు రాష్ట్రాల అధికారులు ఒరిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా చిత్రకొండ ఓహెచ్పిసి కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024- 25 నీటి సంవత్సరంలో బలిమిన జలాశయం నుంచి ఏయే రాష్ట్రాలు ఇప్పటి వరకు ఎంతెంత నీటిని వినియోగించుకున్నాయో లెక్కలు తేల్చారు. అక్టోబర్‌లో ఒరిస్సా తన వాటా 14.4075 టీఎంసీలు నీటిని వినియోగించుకోగా ఆంధ్ర 9.9421 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్లు లెక్కలు కట్టారు. అక్టోబర్‌లో ఒరిస్సా ఆంధ్ర కంటే 4.4654 టీఎంసీలు నీటిని అధికంగా వినియోగించుకున్నట్లు నిర్ధారించారు. 2024-25 నీటి సంవత్సరానికి జులై నుంచి అక్టోబర్ నెలాఖరు నాటికి ఒరిస్సా తన వాటా 43.1609 టీఎంసీలు నీటిని వినియోగించుకోగా, ఆంధ్ర తన వాటాగా 23.0126 టీఎంసీలు నీటిని వినియోగించుకున్నట్లు లెక్కలు కట్టారు. ప్రస్తుతం బలిమెల, జోలాపుట్ జలాశయాల్లో 103.0767 టీఎంసీలు నీటి నిల్వల వలు ఉండగా ఈ నెలాఖరు నాటికి జోలాపుట్టు, బలిమెల రెండు జలాశయాల్లో 4.2000 టీఎంసీల నీటి నిల్వలు వచ్చి చేరుతున్నట్లు నిర్ధారించారు. దీని ప్రకారం మొత్తం నీటి నిల్వలు 107.2767 టీఎంసీలుగా గుర్తించారు. ఇందులో ఒరిస్సా వాటాగా 63.7125 టీఎంసీలు, ఆంధ్ర వాటాగా 43.5642 వినియోగించుకోడానికి ఇరు రాష్ట్రాల అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రస్తుతం గ్రిడ్ డిమాండ్ మేరకు ఇరిగేషన్ అవసరాల నిమిత్తం ఆంధ్ర 2000 క్యూసెక్కులు, ఒరిస్సా 3800 క్యూసెక్కులు వినియోగించుకోవడానికి అంగీకారం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఒరిస్సా తరఫున హైడ్రో కార్పొరేషన్ మేనేజర్ జ్యోతిర్మయ దాస్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఓం ప్రకాష్ నాయక్, మేనేజర్ విజయ్ కుమార్ ప్రతాప్, డిప్యూటీ మేనేజర్ రాకేశ్ పాణిగ్రాహి పొట్టేలు, ఇరిగేషన్ సీఈ పితాబి శెట్టి, ఎస్సీ రమాకాంత్ పాత్రో, అసిస్టెంట్ ఇంజనీర్ గడాదర్ ప్రధాన్, ఆంధ్ర తరఫున ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ చంద్రశేఖర్ రెడ్డి, ఈఈలు శ్రీనివాస్ రెడ్డి వి. రాజేంద్రప్రసాద్ ఏడిఈ క్యాంపు కే.దుర్గా శ్రీనివాసరావు, పంపు స్టోరేజ్ ప్రాజెక్టు ఏఈఈ సిహెచ్.సురేష్ పాల్గొన్నారు.



సమీక్ష జరుపుతున్న అధికారులు

బాదంగీర్ సాయికి ఘన నివాళి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రముఖ నాటక, సినీ నటులు, రంగ సాయి నాటక సంస్థ వ్యవస్థాపకులు, రంగ సాయి నాటక గ్రంథాలయం నిర్మాత బాదంగీర్ సాయికి నగర ప్రముఖులు, కళాకారులు, సాహితీవేత్తలు శుక్రవారం ఘనంగా నివాళ్లర్పించారు. అనారోగ్యంతో సాయి గురువారం సాయంత్రం మృతిచెందిన విషయం తెలిసిందే. మురళీనగర్‌లోని ఆయన గృహంలో ఉంచిన పార్థివదేహాన్ని శుక్రవారం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ, శ్రావణ్, నాయనబాబులు సందర్శించి నివాళ్లర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. సాయి మృతికి ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రమణ, ఎం.చంటి తీవ్ర సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటక, కళా రంగానికి బాదంగీర్ సాయి ఎనలేని సేవలు అందించారని, ఆయన మృతి విశాఖ కళారంగానికి తీరని లోటని తెలిపారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు అరుణ్‌జీ, తెలుగు రమణ, దండు నాగేశ్వరరావు, వై.అప్పారావు, ఎం.ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ ఆహార పదార్థాల విక్రేతలపై కొరడా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరం, జిల్లా పరిధిలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు జరిపిన తనిఖీలలో కల్తీ జరిగినవి, నాణ్యత లేనివి, ఫుడ్ సేఫ్టీ నియమాలను ఉల్లంఘించినట్లు గుర్తించినవి పరిశీలించి పలువురు విక్రేతలకు జాయింట్ కలెక్టర్, డిస్ట్రిక్ట్ అడిషనల్ మెజిస్ట్రేట్ కె.మయూర్ అశోక్ రూ.2 లక్షలా 80 వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జివిబి.నందాజీ మీడియాకు తెలిపారు.

ఆపరేషన్ థియేటర్ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో పీడియాట్రిక్ సర్జరీ విభాగంలో అడ్వాన్స్‌డ్ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌ను శుక్రవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ అత్యాధునిక సదుపాయం సరికొత్త ల్యాప్రోస్కోపిక్ సాంకేతికతను కలిగి ఉంది. ఇది శస్త్రచికిత్స కచ్చితత్వాన్ని మెరుగుపరచడం, రోగి ఫలితాలను మెరుగుపరచడం, యువ రోగులకు కోలుకునే సమయాన్ని తగ్గించడం లక్ష్యంగా పనిచేస్తుందని ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు.

వాలంటీర్ల ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వాలంటీర్లు అందరినీ కొనసాగించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎపి గ్రామ వార్డు వాలంటీర్ల సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి గంధం దీప్తి మాట్లాడుతూ నాడు చంద్రబాబు చెప్పిన మాటకు పూర్తి భిన్నంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామి మాట తీరు ఉందన్నారు. వాలంటీర్ల వ్యవస్థ లేదని ప్రకటించడం విశ్వాస ఘాతుకమని తెలిపారు. వాలంటీర్లను కొనసాగిస్తామని గత ఎన్నికల సమయంలో పదేపదే చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. తమ సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించాలన్నారు. తమ భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వెంకటరావు, జిల్లా ఉపాధ్యక్షులు పి.మణి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు, వాలంటీర్ల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కోడూరు రాము, కె.లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు అజార్, జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు పార్వతి, వాసు, శ్యామ్, రాజు పాల్గొన్నారు.

26న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీలేరు : ఆర్థో న్యూరో కండిషన్ రిహబిటేషన్ స్పెషలిస్ట్, రాయల్ ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఈనెల 26న మంగళవారం సీలేరు ఏపీ జెన్కో కళ్యాణ మండపంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఏపీ జెన్కో ఫోర్‌మెన్ పి.నారాయణరావు వెల్లడించారు. జికె.వీధి మండలం సీలేరులోని బాలాజీ లాడ్జి ఆవరణంలో శుక్రవారం ఉదయం మెగా వైద్య శిబిరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో దీర్ఘకాలికంగా బాధపడుతున్న రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేస్తారని, అవసరమైన రోగులకు రక్త పరీక్షలు తక్కువ ఫీజుతో చేయబడుతుందని పేర్కొన్నారు. టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, పక్షవాతం, కీళ్ల నొప్పులు, మోకాళ్ళ నొప్పులు, మెడ నొప్పులు, వెన్నుముక నొప్పులు వంటి ఆరోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహించనున్నారని తెలిపారు. ఉచిత వైద్య శిబిరానికి మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే వారికి బాలాజీ లాడ్జి యజమాని నక్క జ్ఞానేశ్వరావు భోజన సౌకర్యాలు కల్పిస్తున్నారని చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఏపీ జెన్కో అధికారులు, ఇంజనీర్లు, ఉద్యోగులు, ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది, భవ్య ఆసుపత్రి వైద్యులు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుర్జో, పంచాయతీ కార్యదర్శి, కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్, వి. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని ఏడుగురాళ్లపల్లి పంచాయతీ, వెంకటాపురం గ్రామంలో చింతూరు సబ్ డివిజన్ ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా ఆధ్వర్యాన స్థానిక గుత్త కోయలకు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. యువతకు వాలీబాల్ కిట్టు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పోలీసులు మాట్లాడుతూ గిరిజునలు ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనరాదన్నారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వ్యక్తులతోనూ, అనుమానాస్పద వ్యక్తులతోనూ సంబంధం కలిగి ఉండకుండా, అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని కోరారు. రానున్న చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని వృద్ధులు ఇబ్బంది పడకుండా దుప్పట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. బాల బాలికలకు చదువు ఆవశ్యకతను తెలియజేసి, పిల్లలను విధిగా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. బాల్య వివాహాలు చేయకుండా పిల్లల భవిష్యత్తుకు మంచి అవకాశాలు కల్పించుకోవాలన్నారు. పోలీసు వారు ఏర్పాటు చేసిన ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో చింతూరు సీఐ టి.దుర్గాప్రసాద్, చింతూరు పోలీస్ సిబ్బంది, ఏఎస్ఎస్ పార్టీ వారు పాల్గొన్నారు.

మారేడుబాకలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని మారేడుబాక గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించారు. జడ్డంగి పీహెచ్సీ వైద్యాధికారి జి నాగార్జున వివిధ రుగ్మతలుతో బాధ పడుతున్న 64 మందికి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వైద్య అధికారి వివరించారు. కార్యక్రమంలో హెచ్వి చిన్నయమ్మ, సిబ్బంది సరస్వతి, నూకరత్నం, రాజులమ్మ 104 డిఈఓ శ్రీనివాస్, కనకరాజు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ రకాల పారిశ్రామికవేత్తలు, ఇండస్ట్రియల్ యూనియన్లు, అసోసియేషన్ ప్రతినిధులతో జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిఐఇపిసి) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా తమ కృషి ఉంటుందన్నారు. పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చే వారికి అన్ని విధాలుగా సహకరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో ఎటువంటి పరిశ్రమలను స్థాపిస్తే ఉపయుక్తంగా ఉంటుందో జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, ఇండస్ట్రియల్ యూనియన్లు, అసోసియేషన్ ప్రతినిధులు తమ సూచనలు, సలహాలు అందించాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో ఉన్న ఎంఎస్ఎంఇలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, అందుకు పారిశ్రామికవేత్తలు అందరూ అధికారులతో సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జిఎం వి.ఆదిశేషు పాల్గొన్నారు.